



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190






ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :171 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ మంగళవారం- 21 - జూలై- 2026


## తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు



రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా

జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన

ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనామిగతా..2లో

## ఒక్క ఊరిలో అయినా వంద శాతం రుణమాఫీ అయిందా? రేవంత్‌కు కేటీఆర్ సవాల్!



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

హైదరాబాద్: కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని, కానీ పనులు మాత్రం గడప కూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి, సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట తప్పి కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ విమర్శించారు. భవిష్యత్తులో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారంతో పాటు కాంగ్రెస్ పార్టీని ఓడించాలని ఆయన కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో రైతులకు అవసరమైన అన్నీ ఇళ్ల వద్దకే వచ్చేవని గుర్తు చేసిన కేటీఆర్.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని, మిగతా..2లో

## రేపటినుంచి సీఎం కొడంగల్ పర్యటన



➤ రెండు రోజులపాటు అభివృద్ధి, ఎసఐఆర్‌పై సమీక్షలు

హైదరాబాద్, జూలై 20 : తన కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళ, బుధవారాలు రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దుద్యాల్ మండలం హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్‌ను మంగళవారం సాయంత్రం 4 గంటలకు పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తారు. రాత్రికి కొడంగల్‌లోనే బస చేస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక నాయకులు, బీఎలఏలతో సమగ్ర ఓటరు సవరణ (ఎసఐఆర్)పై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# ఆయిల్ పామ్‌తో రైతుకు స్థిరమైన ఆదాయం

- వర్షాభావ పరిస్థితులున్నా రైతుకు ఖచ్చితమైన ఆదాయం
- మన కొణిజర్ల నుంచే ఆయిల్ పామ్ సీడ్స్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- గోద్రెజ్ అగ్రివేట్ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభం



ఖమ్మం, జూలై 20 : ఖమ్మం జిల్లా కేవలం వ్యవసాయానికే పరిమితమైన తరుణంలో ఇక్కడి రైతాంగానికి అధిక దిగుబడి, మెరుగైన రాబడి అందించేందుకు ఆయిల్ పామ్ సాగు ఒక అద్భుతమైన వరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో దాదాపు రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన గోద్రెజ్ ఇంటిగ్రేటెడ్ పామ్ ఆయిల్ పరిశ్రమను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉండేవి.. జిల్లాల పునర్విభజన తర్వాత ఖమ్మం జిల్లా కేవలం వ్యవసాయానికే పరిమితమైందని, ఇక్కడ నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నీటి ప్రవాహం, పాలేరు, వైరా రిజర్వాయర్లు.. వీటి మీద ఆధారపడి ఇక్కడి రైతులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయం మన జీవన ఆధారంగా మారిన పరిస్థితుల్లోమిగతా..2లో

## గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం.. రైతులకు మంత్రి తుమ్మల పిలుపు..

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



ఖమ్మం జిల్లా: కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. మిగతా..2లో

## అయోధ్య రామమందిర విరాళాల కేసును

# రాజకీయం చేయవద్దు

## కోర్టులు రాజకీయాలకు వేదిక కాదు

అయోధ్య విరాళాల కేసును రాజకీయం చేయవద్దు- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



ఢిల్లి : అయోధ్య రామమందిర విరాళాల కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని పేర్కొంది. ఇది ఒక సాధారణ నేరమని, తాము సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తామని తెలిపింది. ఈ కేసు దర్యాప్తునకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిట్ ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు విచారణ చేస్తున్నారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. కాగా, ఈ కేసుపై సిట్ దర్యాప్తు వివరాలను ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు జులై 27కు విచారణను వాయిదా వేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేసింది. ఈ సందర్భంగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై విచారణకు సిట్ చేయవచ్చా? అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. "మేము చిన్న హెచ్చరిక చేస్తున్నాం.

## నేను మాట్లాడేది 28ఏళ్ల యువకుల గురించి 56ఏళ్ల వ్యక్తుల గురించి కాదు'



- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేలా చూడాలన్న ప్రధాని పిలుపు
- నిర్మాణాత్మక చర్చలు జరగాలన్న మోదీ

ఢిల్లి : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్ గాంధీపై పరోక్షంగా సెటైర్లు వేశారు. ఇటీవల స్కైరూట్ ప్రయోగాలు విజయవంతం అవ్వడంపై మాట్లాడుతూ, "నేను మాట్లాడేది 28 ఏళ్ల యువకుల గురించి, 56 ఏళ్ల వ్యక్తుల గురించి కాదు"అని అన్నారు. ఇటీవలి కాలంలో అంతరిక్ష రంగంలో భారతదేశం సాధించిన విజయాల గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ యువ ఆవిష్కర్తలను ప్రశంసించారు మిగతా..2లో

# వారి రాక కోసం ఎదురుచూస్తున్నాం

## ఇరాన్ విదేశాంగ ప్రతినిధి

- ఇరాన్‌పై దాడుల్ని మరింత తీవ్రం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది.
- అమెరికా చేసే ఏ సాహసానికైనా పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది.



ఢిల్లి : అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై దాడుల్ని మరింత తీవ్రం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఇరాన్ చమురు నిల్వలకు కీలక ప్రాంతమైన ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకుమిగతా..2లో

## పదో తరగతి ఫెయిల్.. గ్రేస్ మార్కులతో పాసయ్యా



- చదువుతో పేదరికాన్ని జయించవచ్చన్న మంత్రి నారాయణ
- పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో పైకొచ్చానని వెల్లడి
- నెల్లూరులో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- విద్యావ్యవస్థలో లోకేశ్ విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ప్రశంస
- అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపు

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు

- డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు చెప్పాలి
- ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రంలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. మిగతా..2లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

# నస్పూర్ యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల నిరసన ఎస్ బి ఐ తరహాలో యూనియన్ బ్యాంక్

## ఖాతాదారులకు రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్





మంచిర్యాల, : మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఎదుట సోమవారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ బి ఐ తరహాలో యూనియన్ బ్యాంక్‌లో ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు రూ.50 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 70 సంవత్సరాల లోపు యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు ప్రమాద బీమా సౌకర్యంపై బ్యాంకు అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్‌లో ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి పెన్షన్‌దారులకు ప్రమాద బీమా, సహజ మరణ బీమా వర్తిస్తుందా లేదా అనే విషయంపై పత్రికలు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని కోరారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నస్పూర్ శాఖ మేనేజర్ బోగే సాగర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, కోశాధికారి బింగి రాజేశం, కార్యదర్శి ఎన్నం శంకర్, ఆర్గనైజర్ తణుకుల మోహన్, జిల్లా నాయకులు సంగెం రాంచందర్, మేడ రాజలింగు, టీ. శ్రీహరి, ఎన్. సదాశివ, ఎండి. ఖాదర్, హుస్సేన్, ఈ. రాజనర్సు, రేకుల పర్వతాలు, బి. ఒదయ్య, ఎస్‌డీ అబ్బాస్ అలీ, బాజీరెడ్డి సురేష్, అర్వ మల్లయ్య, ఇరుకుల జనార్దన్, పి. లక్ష్మయ్య, కె. పోచయ్య, ఎస్. బాణయ్య, కె. దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. నిరసన సందర్భంగా "రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలి", "సహజ మరణానికి రూ.10 లక్షల బీమా అమలు చేయాలి", "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# తొలి తరం ఆదివాసి ఉద్యమ నేత సిడాం శంభుకు నివాళులర్పించిన ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్ : తొలి తరం ఆదివాసి ఉద్యమ నేత, తుడుం దెబ్బ వ్యవస్థాపకులు, ఆదివాసుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన యోధుడు సిడాం శంభు 8వ వర్ధంతి సందర్భంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఉట్నూర్ మండలం మత్తడిగూడా గ్రామంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో సుగుణక్క పాల్గొని సిడాం శంభు సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ, కొమరం భీమ్, బిర్సా ముండా, రాంజీ గోండ్ వంటి మహనీయుల స్ఫూర్తితో "జల్--జంగల్--జమీన్" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆదివాసుల హక్కుల సాధన కోసం సిడాం శంభు జీవితాంతం పోరాడారని అన్నారు. 2006లో అటవీ హక్కుల చట్టం అమలు కోసం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిడాం శంభు పటేల్ అధ్యక్షతన నిర్వహించిన భారీ ధర్నా ఆదివాసుల ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు.ఆదివాసుల భూమి, అడవి, జీవన హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సుగుణక్క అన్నారు. సిడాం శంభు ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కనక ప్రతిభ,ముక్కడే విష్ణు, కొడప కన్ను, కుటుంబం సభ్యులు..సిడం కౌసల్య, సోనేరావ్, లచ్చు,శేషు,నాయకులు వినాయక్,షైక్ మహమ్మద్, కనక సుదర్శన్, కోటేశ్వర్,ఆదివాసి సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధులపై హాస్టల్ విద్యార్థులకు అవగాహన






మందమర్రి : మందమర్రి 2 వ జూన్ లోని ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో డాక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులందరూ ప్రభుత్వం గా ఉండాలని, వర్షాకాలం సమయంలో డెంగ్యూ, మలేరియా, చర్మవ్యాధులు రాకుండా తడి దుస్తులను ధరించకూడదని, ఆరు బయట లభించే ఆహారాన్ని తీసుకోకూడదని సూచించారు. శరీరంలో ఏదైనా సమస్య అనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదిస్తే వ్యాధి ప్రారంభమై మొదటి దశలోని పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిగ్‌హాట్ యాప్‌లో నిషేధిత గడ్డి మందుల విక్రయాలా..?

## డోర్ డెలివరీతో అధికారుల పర్యవేక్షణపై తీవ్ర అనుమానాలు..!




ఆసిఫాబాద్ : ఆన్‌లైన్ వ్యవసాయ వేదిక బిగ్‌హాట్ ద్వారా తెలంగాణలో నిషేధితమని పేర్కొంటున్న గడ్డి మందులు సైతం విక్రయమవుతున్నాయనే ఆరోపణలు రైతుల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. రైతుల కథనం ప్రకారం గ్లైఫోసేట్ ఆధారిత ఉత్పత్తులతో పాటు టాపర్--77, రౌండ్‌అప్ వంటి గడ్డి మందులు బిల్లుతో సహా హోమ్ డెలివరీ అవుతున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం నిషేధించిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయమవుతున్నాయా? అయితే వాటిని ఎవరు పర్యవేక్షిస్తున్నారు? చట్టవిరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లయితే చర్యలు కొనుగోలు చేసిన రైతులపైనా ఉంటాయా? లేక విక్రయించే సంస్థలపైనా ఉంటాయా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, సంబంధిత నియంత్రణ సంస్థలు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని రైతులు కోరుతున్నారు.




# తిర్యాని అభివృద్ధే లక్ష్యం.. అఖిలపక్ష ఐక్యతతో జేఏసీ ఏర్పాటు

## కొమురం భీం విగ్రహానికి నివాళులు.. ఎమ్మార్వోకు వినతిపత్రం.. దశలవారీ ఉద్యమానికి శ్రీకారం

తిర్యాని, : తిర్యాని మండలంలో నెలకొన్న రోడ్లు, రవాణా, విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ మండల రాజ్యాంగపాలక హక్కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలతో పాటు వివిధ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు కలిసి తిర్యాని మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా లిజాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)లిని ఏర్పాటు చేశారు. కొమురం భీం చౌరస్తా కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడతామని ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో)కు వినతిపత్రం అందజేసి మండలంలోని రోడ్ల దుస్థితి, రవాణా సౌకర్యాల కొరత, విద్య, వైద్యం, తాగునీటి సమస్యలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జేఏసీ కమిటీ ఏర్పాటు, ఎంఆర్వో, ఎంపీడీవో, అటవీ శాఖ అధికారులకు వినతిపత్రాల సమర్పణ, మండల పోలీస్ స్టేషన్ ముట్టడి, శాంతియుత నిరవధిక ధర్నా, జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో, ఐటీడీఏ పీఓలకు వినతిపత్రాలు, మండల బంద్, భారీ ర్యాలీ, పోస్ట్‌కార్డ్ ఉద్యమం, కొమురం భీం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు,



కక్షసాధింపు చర్యలకు నిరసన, ఒకరోజు వంటావార్పు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల భాగస్వామ్యంతో ఉద్యమం, తిర్యాని నుంచి కుమురం భీం జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర వంటి దశలవారీ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు ఐక్యంగా ముందుకు వచ్చి తిర్యాని మండల అభివృద్ధే లక్ష్యంగా జేఏసీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, మండల సమగ్ర అభివృద్ధి కోసం అందరూ ఒకే వేదికపై కలిసి పనిచేయాలనే సంకల్పంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాజకీయాలు కాదు.. తిర్యాని అభివృద్ధే తమ ఏకైక అజెండా అని, ప్రజల సహకారంతో ఉద్యమాన్ని విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. అధికారులు, ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం



చేస్తామని, అవసరమైతే నిరవధిక ఆందోళనలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ముట్టడి వంటి కార్యక్రమాలు చేపడతామని జేఏసీ



నాయకులు హెచ్చరించారు. తిర్యాని ప్రజల హక్కులు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# చెన్నూరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం.

## 60 మందిని ఆపరేషన్ కోసం తరలింపు.

చెన్నూర్, : యశోద బాయి, కిషన్ లాహోటి స్మారకార్థముగా చెన్నూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం ను నిర్వహించారు. సోమవారం నాడు చెన్నూరు లయన్స్ క్లబ్ కరీంనగర్ లోని రేకుర్తి ఉదార నేత్ర వైద్యశాల వారి సౌజన్యంతో, వైస్ చైర్మన్ లయన్ చిదురా సురేష్ సహకారంతో చెన్నూరు లోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఈ ఉచిత నేత్ర వైద్య శిభిరం నిర్వహించారు. ఇందులో 120 మందికి బి పి,షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు అందులో 60 మంది కంటి ఆపరేషన్ కోసం అర్హత సాధించినట్లు రేకుర్తి ప్రతినిధి ప్రభాకర్ మరియు చెన్నూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ నిమ్మల సాగర్ ప్రకటించారు.వీరిని రేకుర్తి ఆసుపత్రి కి తరలించారు.వీరికి కంటి ఆపరేషన్స్ నిర్వహించి బుధవారం నాడు వారిని వారి స్వస్థలాలకు పంపిస్తామని క్లబ్ అధ్యక్షులు లయన్ నిమ్మల సాగర్ తెలిపారు. చెన్నూరులో జరిగిన ఉచిత కంటి శిభిరం నిర్వహణ అయిన ఖర్చును చెన్నూరు ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ లాల్ లహోటి సోదరుడు డాక్టర్ ఓం లహోటి నానమ్మ యశోద



బాయి,తాతయ్య కిషన్ లాహోటి గార్ల జ్ఞాపకార్థం సుమారు 15,000 రూపాయలు స్పాన్సర్ చేసినందుకు క్లబ్ అధ్యక్షులు లయన్ నిమ్మల సాగర్ మరియు జోన్ చైర్ పర్సన్ లయన్ జాడి తిరుపతి ప్రత్యేకంగా హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ప్రముఖ వైద్యులు శంకర్ లాల్ లాహోటి, రీజియన్ చైర్ పర్సన్ లయన్ గుర్రాల చక్రాధర్, జోన్ చైర్ పర్సన్ లయన్ జాడి తిరుపతి, 320జి జిల్లా కాబినెట్ సభ్యుడు లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, క్లబ్ కార్యదర్శి లయన్ కప్ప ప్రతాప్ సింగ్, కోశాధికారి



లయన్ సౌదం శ్రీనివాస్, సభ్యులు లయన్ సౌదం సంతోష్, లయన్ ఎన్నాం సతీష్, సామాజిక కార్యకర్తలు నిమ్మల విశాల, ముత్యాల శ్రావణి, కొమ్మెర నవీన్, రావుల మధుకర్, కోడిపెల్లి బాణయ్య, అమాన్,మోర్ల మదూకర్, పి హెచ్ సి సిబ్బంది బి. బాలు హెచ్ ఈ ఓ, డి. మహేందర్ యం ఎల్ హెచ్ పి,ఆశా సబ్బంది కె. లావణ్య, డి రాధ, కె బాలమణి,యం. కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నీనో ప్రభావం తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంగా పని చేయాలి

## స్పెషల్ ఆఫీసర్ ఇలంబర్తి

ఆసిఫాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూర్ మండలంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో సోమవారం ఎల్‌నీనో ప్రభావ తీవ్రతను తగ్గించే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షా సమావేశం జరిగింది.ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారి ఇలంబర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ప్రతి శాఖ తన కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.మంచిర్యాల శాసనసభ్యులు ప్రేమ్‌సాగర్ ఈ అంశాన్ని ప్రజల సంక్షేమ దృక్పథంతో చూడాలని, రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు పెసర్లు, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి



ప్రభుత్వం కట్టుబడి ఉందని, అటవీ హక్కుల చట్టం కింద హక్కులు పొందిన రైతులకు రైతు భరోసా నిధులు అందించాలని అధికారులను ఆదేశించారు.ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ పోడు భూముల సమస్యలపై చర్చ జరుగుతున్న సమయంలో అటవీ శాఖ అధికారులు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు యూరియా ఎరువుల పంపిణీ కోసం వ్యవసాయ శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత శాఖల సమన్వయంతోనే ఎల్‌నీనో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని, ప్రభుత్వ సూచనలు ప్రతి గ్రామానికి చేరేలా మీడియా ప్రచారం నిర్వహించాలని కోరారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని, భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంచాలని ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, తాగునీరు, విద్యుత్, పశుసంవర్ధక, ఆరోగ్యం, అటవీ, పంచాయతీరాజ్, పురపాలక, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తమ తమ శాఖల ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను వివరించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మందమకరందు, ఉమ్మడి జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యాషన్ మోజులో ఎల్‌ఈడీ లైట్లు.. రోడ్లపై ప్రాణాలకు ముప్పు!

## బైక్‌లు, కార్లు, భారీ వాహనాల్లో అధిక వెలుతురు.. ప్రమాదాలకు కారణమవుతున్న 'గ్లేర్ ఎఫెక్ట్'

మందమర్రి,: ఒకప్పుడు లగ్జరీ కార్లకే పరిమితమైన అధిక ప్రకాశం గల ఎల్‌ఈడీ హెడ్‌లైట్లు, ఫాగ్ లైట్లు ఇప్పుడు సాధారణ బైక్‌ల నుంచి కార్లు, ఎస్‌యూవీలు, లారీలు, బస్సుల వరకు విస్తరించాయి. మార్కెట్‌లో లభిస్తున్న అధిక వాటేజ్ ఎల్‌ఈడీ బల్బులు, స్పాట్ లైట్లు, ఫాగ్ ల్యాంపులు, ఎల్‌ఈడీ బార్ లైట్లను వాహనాలకు అమర్చుకోవడం ఫ్యాషన్‌గా మారింది. అయితే ఈ ఫ్యాషన్ మోజు రాత్రి వేళల్లో రోడ్లపై ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల నుంచి వెలువడే అధిక తీవ్రత గల తెల్లటి కాంతి కారణంగా డ్రైవర్లు, బైక్ రైడర్లు కొద్దిసేపు రోడ్డును స్పష్టంగా చూడలేకపోతున్నారు. నిపుణులు దీనిని లిగ్లేర్ ఎఫెక్ట్'లిగా పేర్కొంటున్నారు. కేవలం రెండు, మూడు సెకన్ల పాటు చూపు మందగించినా ఎదురుగా వచ్చే వాహనం, పాదచారులు, జంతువులు లేదా స్పీడ్ బ్రేకర్లు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### బైక్‌ల్లో మరింత ప్రమాదకరం

ఇటీవల యువత తమ బైక్‌లకు కంపెనీ హెడ్‌లైట్ల స్థానంలో అధిక వెలుతురు ఇచ్చే ఎల్‌ఈడీ బల్బులు అమర్చడంతో పాటు, క్రాష్ గార్డులపై అదనపు ఫాగ్ లైట్లు, స్పాట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని బైక్‌లలో నాలుగు నుంచి ఆరు వరకు అదనపు లైట్లు కనిపిస్తున్నాయి. ఇవి ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లలో నేరుగా పడటంతో ప్రమాద అవకాశాలు పెరుగుతున్నాయి. కార్లతో పోలిస్తే బైక్ రైడర్లకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో గ్లేర్ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటోంది.




### కార్లు, లారీల్లోనూ అదే పరిస్థితి

కొన్ని కార్లు, ఎస్‌యూవీల్లో కంపెనీ అమర్చిన లైట్లకు అదనంగా ఫాగ్ లైట్లు, హై పవర్ ఎల్‌ఈడీలు అమర్చుతున్నారు. అలాగే కొన్ని లారీలు, బస్సుల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా అధిక వెలుతురు ఇచ్చే లైట్లను ఉపయోగిస్తున్నారు. వీటి కాంతి ఎదురుగా వచ్చే వాహనదారులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది.

### ఫాగ్ లైట్లు ఎప్పుడు వాడాలి?

ఫాగ్ లైట్లు కేవలం పొగమంచు, భారీ వర్షం, దుమ్ము లేదా పొగ కారణంగా దృశ్యమానత తగ్గిన సందర్భాల్లో మాత్రమే వినియోగించాలి. సాధారణ పరిస్థితుల్లో వాటిని ఉపయోగించడం అవసరం లేదు. అయినప్పటికీ చాలా మంది రాత్రంతా ఫాగ్ లైట్లను ఆన్‌లో ఉంచడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతోంది.

### కళ్లపై తీవ్ర ప్రభావం

అధిక తీవ్రత గల తెల్లటి లేదా నీలి రంగు ఎల్‌ఈడీ కాంతి కళ్లపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుంది. కళ్లలో మంట, నీరు కారడం, తలనొప్పి, తాత్కాలికంగా చూపు మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వర్షంలో తడి




రోడ్డుపై ఈ కాంతి ప్రతిబింబించడం వల్ల ప్రమాదం మరింత పెరుగుతుంది.

### నిబంధనలు ఉన్నా అమలు ఏది?

మోటారు వాహన నిబంధనల ప్రకారం వాహన తయారీ సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు విరుద్ధంగా అధిక వాటేజ్ లైట్లు అమర్చడం నిబంధనలకు విరుద్ధం. ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా లైట్లు ఉపయోగించే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే క్షేత్రస్థాయిలో తనిఖీలు, అమలు ఆశించిన స్థాయిలో లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట

అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఫాగ్ లైట్లు ఉపయోగించడం, ఎదురుగా వాహనాలు వస్తే లో-బీమ్‌కు మార్చడం, అనధికారిక ఎల్‌ఈడీ లైట్లు అమర్చకుండా ఉండటం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# బీజేవైఎం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎతం శివకృష్ణ.




BHARATIYA JANATA PARTY- TELANGANA

Press Release

Yuva Morcha District Presidents

చెన్నూర్,: మంచిర్యాల జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా చెన్నూర్ పట్టణ కౌన్సిలర్ ఎతం శివకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్య తలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నేతలకు శివకృష్ణ ధన్య వాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బీజేవైఎంను బలోపేతం చేసేందుకు, యువతను భాగస్వాములను చేసేందుకు ముమ్మరంగా కృషి చేస్తానన్నారు.

# ఆరెపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహణ.



మంచిర్యాల : భీమారం మండలం,ఆరెపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చెన్నూర్ కోర్టు న్యాయమూర్తి పి. రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. న్యాయ సహాయం అవసరమైన ప్రతి ఒక్కరూ మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే కోర్టులలో నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా రాజీ పరిష్కారానికి అనుకూలమైన కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా గంజాయి, గుడుంబా మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటికి సంబంధించిన కఠిన చట్టాలు మరియు శిక్షల గురించి ప్రజలకు వివరించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమారం ఎస్ఐ ఎ. రాజేందర్, న్యాయవాదులు కె. మహేష్, శ్రీనివాస్, పున్నం, జెక సంజీవ్, కొప్పుల ప్రభాకర్, రమ్య, మమత, ఆరెపల్లి గ్రామ సర్పంచ్ వీరయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి - జిల్లా కలెక్టర్



పుట్టపర్తి : ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 421 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య, ఎస్‌డీసీ విజయకుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 102 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ



పుట్టపర్తి : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ 102 ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, విచారణలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదాలు, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీఆర్‌బీ సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎయిర్‌పోర్ట్ సీఐ బొజ్జప్ప, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భూ ధరల నిర్ణయానికి నేడు రైతులతో సమావేశం



యాడికి : యాడికి మండలంలోని కమలపాడు, కుందనకోట గ్రామాల పరిధిలో ప్రతిపాదిత 950 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపడుతున్న నేపథ్యంలో భూముల ధరల నిర్ణయానికి సంబంధించి నేడు రైతులు, భూ యజమానులతో సమావేశం నిర్వహించనున్నట్లు యాడికి తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన నేడు మంగళవారం చింతలాయపల్లి గ్రామ సమీపంలోని శ్రీ కొత్త వెంకటరాయుని స్వామి దేవాలయంలో సమావేశం జరగనుంది. ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న పట్టా భూముల యజమానులు ఉదయం 9:30 గంటలకి సమావేశానికి హాజరుకావాలని సూచించారు. భూముల ధరల నిర్ణయ ప్రక్రియలో రైతుల అభిప్రాయాలు, సూచనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నందున అర్హులైన భూ యజమానులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించి సహకరించాలని తహశీల్దార్ కోరారు

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున ఆలయానికి రూ.1 లక్ష విరాళం



యాడికి :యాడికి మండల కేంద్రంలోని నాగులకట్ట వీధిలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్ఫటిక లింగ ప్రతిష్ఠాపన, ఆలయ అభివృద్ధి పనుల కోసం కడప జిల్లా ముద్దనూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన చిలకల గోవర్ధన్ తరపున చంద్రశేఖర్ సోమవారం ఆలయ కమిటీకి రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తుల సహకారంతో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి స్ఫటిక లింగ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరింత మంది దాతలు, భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరుల నిరసన




యాడికి : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు సోమవారం యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖరులు, స్టాంప్ వెండర్లు పెన్‌డౌన్ నిర్వహించారు. యాడికి దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో జీఓ 396 అమలుతో లేఖరులు, స్టాంప్ వెండర్ల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీఓను ఉపసంహరించుకుని తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బండారు రామకేశవులు, జూటూరు అబ్దుల్ రజాక్, ఉద్దండపు నవీన్ కుమార్, సరోదే ఈశ్వరయ్య, మాగిశెట్టి నరేష్, కొర్రపాటి చిన్న వెంకటసుబ్బారెడ్డి, సరోదే సుభాష్, మక్కల రుక్మాంగద, బండారు లక్ష్మణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# చదువుతోనే ప్రతి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు - రాష్ట్ర మంత్రి

### జగత్తులో అత్యంత శక్తివంతమైనది విద్య ఒక్కటే - ఎమ్మెల్యే
### అందరూ బాగా చదువుకొని భవిష్యత్తుకు బాటలో వేసుకుని మంచి పేరు తెచ్చుకోవాలి - కలెక్టర్






పుట్టపర్తి : విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. జగత్‌లో అత్యంత శక్తివంతమైనది విద్య ఒక్కటేనని పేర్కొంటూ విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద మహి శ్రీనివాస గార్డెన్స్‌లో సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "షైనింగ్ స్టార్స్ అవార్డ్స్2026" కార్యక్రమంలో మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, డీఈఓ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 237 మంది విద్యార్థులకు మొత్తం రూ.47.40 లక్షల నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు, అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ విద్యకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విద్యార్థులు కష్టపడి చదివి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో డీఐఈఓ చెన్నకేశవులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి మోహన రంగ ఆశయ సాధనకే


### రాధా రంగా మిత్రమండలి ఏర్పాటు



గుంతకల్లు : వంగవీటి మోహన రంగ ఆశయ సాధన కోసమే రాధా రంగా మిత్రమండలి ఏర్పాటు చేయడం జరిగిందని రాధా రంగా మిత్రమండలి రాయలసీమ జోనల్ ఇంచార్జ్ బలం సుబ్బరాయుడు, కడప జిల్లా బీసీ విభాగ అధ్యక్షుడు దొంతు మురళీమోహన్, కడప జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి రాధా రంగా మిత్రమండలి రాయలసీమ జోనల్ ఇంచార్జ్ బలం సుబ్బరాయుడు, కడప జిల్లా బీసీ విభాగ అధ్యక్షుడు దొంతు మురళీమోహన్, కడప జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు పద్మావతి పాల్గొన్నారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని బలిజ కళ్యాణ మండపం నందు జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగ విజయవాడ ప్రాంతంలో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పోరాడిన ప్రముఖ నాయకుడు. ముఖ్యంగా పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసి ప్రజల్లో విశేష ఆదరణ పొందారని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుని ఆయన త్యాగాలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకై రాధా రంగా మిత్రమండలి సంస్థ స్థాపించడం జరిగిందని తెలిపారు. అనంతరం రాధా రంగా మిత్రమండలి అనంతపురం జిల్లా ఇన్చార్జి గా బుర్ర హంపి రాయల్ ని ప్రకటించారు. అనంతపురం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా అరికెచర్ల నరేంద్ర రాయల్, గుంతకల్లు నియోజకవర్గ ఇన్చార్జి గా ఆకుల ధనరాజ్ రాయల్, ఉరవకొండ నియోజకవర్గం ఇన్చార్జిగా గాజుల శ్రీధర్ రాయల్ ని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంతకల్లు బలిజ సంఘం అధ్యక్షుడు పూల రమణ, గోవిందు రాజులు, పెద్దలు మరియు బిసి, మైనారిటీ నాయకులు, వంగవీటి రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

### జిల్లా యాదవ సంఘం సమావేశంలో నాయకుల పిలుపు





పుట్టపర్తి : యాదవులంతా ఐక్యంగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి వంతెన సమీపంలోని చిల్డ్రన్ పార్క్ ఫుడ్ కోర్టులో ఆదివారం జిల్లా యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నరసప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని పలువురు ముఖ్య నాయకులు పాల్గొని యాదవుల అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యాదవులందరూ ఐక్యతతో ముందుకు సాగితేనే తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. పుట్టపర్తి జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ ఆలయం నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు శ్రీకృష్ణుడి ఆలయం, కమ్యూనిటీ భవనం తదితర అంశాల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా యాదవులు రాజకీయంగా కూడా చురుకుగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేయాలని, ఇందుకోసం జిల్లా యాదవ సంఘం కమిటీ సభ్యులు ముందుండి పోరాడుతారని తెలిపారు. యాదవుల హక్కులు, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి తమ హక్కులను సాధించుకోవాలని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన యాదవ సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## టెట్ సమస్యల పరిష్కారానికి చట్ట సవరణ చేపట్టాలి - వైయస్సార్ టి ఏ డిమాండ్



పుట్టపర్తి : టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) అమలుకు ముందు చట్టబద్ధంగా నియమితులైన ఉపాధ్యాయుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టెట్ విధానం అమలులోకి రాకముందే అప్పటి ప్రభుత్వ నియామక నిబంధనలు, అర్హతల ప్రకారం పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి నియమితులైన అనేక మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం టెట్ నిబంధనల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో చట్టబద్ధంగా జరిగిన నియామకాలపై కొత్త నిబంధనలను ప్రతికూలంగా వర్తింపజేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. టెట్ అమలుకు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు శాశ్వత పరిష్కారం కల్పించేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే టెట్‌తో సంబంధం లేకుండా సీనియర్ ఉపాధ్యాయులకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని, చట్ట సవరణ జరిగే వరకు సంబంధిత ఉపాధ్యాయులు ఎటువంటి ప్రయోజనాలు కోల్పోకుండా, ప్రతికూల పరిపాలనా చర్యలకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయుల న్యాయమైన ఆందోళనలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్, జిల్లా అధ్యక్షుడు పి.వి. రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బడా హరిప్రసాద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గోగుల శ్రీనివాసులు, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కనకంటి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## ఇంటిపై విరిగిపడిన కొండచరియలు- ఒకే కుటుంబంలో ఏడుగురు మృతి- జమ్ముకశ్మీర్‌లో కుండపోత వర్షాలు

### జమ్ముకశ్మీర్‌లో ఓ ఇంటిపై విరిగిపడిన కొండచరియలు- ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి

: జమ్ముకశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగులుస్తున్నాయి. పూంఛ్ జిల్లాలోని లోరాన్ గ్రామంలో సోమవారం మట్టితో నిర్మించిన ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబంలోని ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో సహాయక బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా ఇప్పటివరకు మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు గల్లంతయ్యారు. వరదలు, కొండచరియలు పలుచోట్ల భారీ నష్టం కలిగించాయి.

## బిగ్ బాస్కెట్ కాదు... బిగ్ హాట్ యాప్..

### ఇందులో దొరికేది కూరగాయలు కాదు.నిషేధిత ప్రాణాంతక విషాలు.
### రైతులకు డోర్ డెలివరీ అవుతున్న మరణ శాసనం
### నిద్రపోతున్నా వ్యవసాయ, పోలీస్ అధికారులు?




మంచిర్యాల, : టెక్నాలజీ పెరిగింది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు, ఇంటికే అన్నీ వచ్చేస్తున్నాయి. కానీ అదే టెక్నాలజీని అడ్డం పెట్టుకుని, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, తెలంగాణలో నిషేధించిన ప్రమాదకరమైన గడ్డి మందులను యథేచ్ఛగా డోర్ డెలివరీ చేస్తోంది ఒక యాప్! దాని పేరే "బిగ్ హాట్".

ఫెర్టిలైజర్స్ (ఎరువులు) అమ్ముతామనే ముసుగులో ఈ యాప్‌లో జరుగుతున్న బాగోతం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారుతోంది.

### స్క్రీన్ మీద ఫెర్టిలైజర్స్.. లోపల మాత్రం 'మరణాయుధాలు'!

సాధారణంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే యాప్ ఇది. 24 గంటలు ఎప్పుడైనా బుక్ చేసుకోవచ్చు. ఇక్కడి వరకు అంతా బానే ఉంది కానీ, అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది! తెలంగాణ ప్రభుత్వం పర్యావరణానికి, భూగర్భ జలాలకు, మనుషుల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుందని 'గ్లైఫోసేట్' గడ్డి మందును పూర్తిగా నిషేధించింది.బహిరంగ మార్కెట్లో ఎక్కడైనా ఈ మందులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయి. కానీ ఈ బిగ్ హాట్ యాప్‌లో మాత్రం ఎలాంటి భయం లేకుండా 'టాపర్ 77', 'రౌండ్ ఆఫ్' వంటి ప్రమాదకర నిషేధిత గడ్డి మందులను పక్కా బిల్లుతో సహా నేరుగా రైతుల ఇళ్లకు డోర్ డెలివరీ చేస్తున్నారు!

### అధికారుల కళ్ళు కప్పి... భారీ దందా!

అధిక ధరలకు అమ్ముతూ,నిషేధిత కెమికల్స్ సరఫరా చేస్తున్న ఈ యాప్ వ్యవహారం ఇప్పుడు పెను సంచలనంగా మారింది.ఇంత బహిరంగంగా నిబంధనలను ఉల్లంఘిస్తూ హోమ్ డెలివరీ ఇస్తుంటే. ఈ వ్యవహారం వ్యవసాయ శాఖ అధికారులకు అసలు తెలియదా? లేక తెలిసి కూడా కళ్ళు మూసుకున్నారా? అంత ఈజీగా కొరియర్ సర్వీసుల ద్వారా నిషేధిత మందులు గ్రామాలకు సరఫరా అవుతుంటే పోలీస్ శాఖ ఏం చేస్తోంది? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.

### రైతుల డిమాండ్.. తక్షణమే రంగంలోకి దిగాలి!

ఆన్‌లైన్ చాటున సాగుతున్న ఈ నల్ల బజారు దందాపై తక్షణమే వ్యవసాయ అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. యాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, నిషేధిత విష రసాయనాలు ప్రతి చేనుకూ చేరి, భూములు బంజరుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా? ఈ యాప్ దందాను అడ్డుకుంటారా? వేచి చూడాలి!

## చింతలమానేపల్లి మండలంలో సమగ్ర భూ సర్వే అవగాహన గ్రామసభలు



ఆసిఫాబాద్ : చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకొండ, రవీంద్రానగర్, కొర్సిని గ్రామ పంచాయతీల్లో సమగ్ర భూ సర్వేపై అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు.ఈ సభల్లో భూ సర్వే విధానం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పత్రాల నమోదు తదితర అంశాలపై అధికారులు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్, ఎంపీడీఓ సత్యనారాయణ, స్థానిక సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, డిప్యూటీ తహసీల్దార్ దౌలత్ రావు, సర్వేయర్ శ్రీకాంత్, గిర్దావర్, గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815